## ఈ వారం కథ

**ఆఫీసులోకి అడుగుపెట్టేసరికి "ఎడిటర్‌గారు మీ కోసమే ఎదురు చూస్తున్నారు" అని చెప్పింది టైపిస్ట్ కమ్ అక్కౌంటెంట్ సుగుణ.**

ఉదయాన్నే నా కోసం ఎదురుచూస్తున్నారంటే ఏదో స్పెషల్ స్టోరీ గురించే అయ్యుంటుందను కుంటూ గోవిందరావుగారి రూమ్‌లోకి అడుగుపె ట్టాను. నన్ను చూడగానే ఆయన "రా, రా. నీ కోసమే ఎదురుచూస్తున్నాను" అని ఆయన ఎదు రుగా వున్న కుర్చీ చూపించారు కూర్చోమన్నట్లుగా.

సంగతేంటన్నట్లుగా ఆయన వంక చూశాను. ఆయనొకసారి చిన్నగా దగ్గి "మునిసిపల్ ఆఫీసులో ఉద్యోగులు ప్రతి చిన్న పనికి లంచం అడుగు తున్నారు. చేయి తడిపితేగాని ఫైలు కదలడం లేదట. చాలామంది కంప్లయింట్ చేస్తున్నారు. నిన్న మా బావమరిది పనిమీద వెళ్తే వంద రూపా యలు గుంజిగాని పని పూర్తిచేయలేదట. ఇక చూస్తూ వూరుకుంటే లాభం లేదు. మన పేప ర్‌లో దాని గురించి వార్త రాయాలి. ఆ ఉద్యోగుల లంచాల భాగోతం అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలి. వార్త పకడ్బందీగా వాళ్ళకి బుద్ధొచ్చేలా వుండాలి" అని చెప్పారాయన.

# ఇది వార్త కాదు

– తుల్లి రాజగోపాల్



ఒక ప్రాంతీయ దినపత్రిక ఎడిటర్‌గా ఆయన అటువంటి వార్త ఆశించడం న్యాయమే. ఆ పేప ర్‌లో విలేఖరిగా పనిచేసే నేను ఆ వార్తను వెంటనే వ్రాయాలి మరి తప్పదు. ఎడిటర్‌గారు ప్రత్యేకించి చెప్పాక కూడా నేనా వార్త రాయకపోతే నా ఉద్యోగం పుటుక్కుమని ఊడుతుంది. అక్షరాలు రాయడం తప్ప మరో పని నాకు చేతకాదు.

కాని ఆ వార్త రాయాలనిపించడం లేదు. నా ముఖంలో ప్రస్ఫుటమవుతున్న భావాలు గమనిం చినట్లుగా "ఏంటి ఆలోచిస్తున్నావ్? ఆ వార్త రాయడం వల్ల ప్రజలకు మనమెంతో మేలుచేసిన వాళ్ళమవుతాం!" అన్నారు మా ఎడిటర్‌గారు.

ఆ మాటలంటున్న ఆయన ముఖాన్ని పరిశీ లనగా చూశాను. ఆహా! ఎంత నిజాయితీగా చెప్తున్నాడీయన. ప్రజలకు మేలుచేయాలి. అవును మరి పత్రికలు వున్నవెందుకు! ఇటువంటి తప్పుడు పనులను ఎండగట్టడానికే! అవినీతిని, కుంభకో ణాలను బైటకు తీసి ప్రజలకు తెలియజేయాలి. పత్రికలంటే వ్యవస్థకు నాలుగోస్తంభం వంటివి. విలేకర్లంటే 'వాచ్ డాగ్స్ ఆఫ్ ది సొసైటీ'.

అన్నీ నిజమే! కాని మా ఎడిటర్ మాటలే నిజం కావు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో జరుగుతున్న అవినీతిని, సూపరింటెండెంట్ లంచగొండితనాన్ని ఆధారాలతో సహా సేకరించి వార్త రాస్తే ఈ ఎడి టర్ మహాశయుడు ఏం చేశాడు! ఆ వార్తని పేపర్లో రానివ్వకుండా నొక్కిపెట్టాడు. అదేమంటే – ఆ సూపర్నెంట్ ఆయనకి కావలసినవాడు, ఆ వార్త రాస్తే పరోక్షంగా ఈయన పరువు పోతుంది!

ఈ వూరి ఎమ్మెల్యే అవినీతి గురించి, అక్ర మార్జన గురించి రాసినా అంతే! ఆ ఎమ్మెల్యే ప్రభుత్వ క్వారీని రహస్యంగా తవ్వించి అమ్ముకుం టుంటే, తాను అంతకంటే రహస్యంగా ఫోటోలు తీసి, ప్రభుత్వం, ప్రజలు అదిరిపోయేలా వార్త సిద్ధం చేస్తే ఏం చేశాడీయన! "మా కులం ఎమ్మెల్యే గురించి చెడుగా రాస్తావా!" అని నా మీద ఇంతెత్తు ఎగిరిపడి ఆ వార్తను చెత్త బుట్టకు ఆహారంగావేశాడు. "నీ స్పీడు తగ్గించుకో కుమార్" అని సలహా ఇచ్చాడు. "పెద్దవాళ్ళతో మనకు గొడవెందుకు" అని నన్ను బుజ్జగించాడు.

కాని ఆ పెద్దవాడు మూడేళ్ళ క్రితం చాలా చిన్నవాడని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి గెలిచాడని, ఆ తర్వాత దొరికినకాడికి దోచుకుంటున్నాడని తెలి సినా మాట్లాడడు.

ప్రభుత్వ అధికారుల గురించి వ్రాస్తే అడ్వర్ట యిజ్‌మెంట్లు రావంటాడు. పోలీసాఫీసర్ల గురించి వ్రాస్తే కాంట్రాక్ట్స్ దెబ్బతింటాయంటాడు. పేపర్ నడిపే యజమానే ఎడిటర్‌గా వుంటే లోకల్ పేప ర్లలో ముక్కుసూటిగా వార్తలు వ్రాయాలనుకునే విలేఖరికి అనుక్షణం భంగపాటే! అందుకు ఉదా హరణ నేనే!

ఇప్పుడీ మునిసిపాలిటీ ఉద్యోగుల లంచగొండి

తనం గురించి వ్రాయమంటున్న మా ఎడిటర్ నిజాయితీకి జోహార్లర్పించాలి. ఆ ఉద్యోగుల అవినీతి గురించి నాకు తెలిసి చాలా రోజులయింది. పత్రికా విలేఖరిగా అటువంటి వార్తల పట్ల ఉదాసీనంగా వుండకూడదని తెలుసు. అయినా నిర్లిప్తంగా వుండిపోయాను. కాని ఈ రోజున మా ఎడిటరే ఆ వార్త రాయమంటున్నాడే!

"సాయంత్రానికి ఆ వార్త రెడీచేస్తే రేపు బేనర్ ఇద్దాం. వీలుంటే రెండు రోజులపాటు వరుసగా వేద్దాం. పూర్తి వివరాలు సేకరించు. నువ్వు తలుచుకుంటే అదిరిపోయేలా రాయగలవ్!" అంటూ నన్ను పొగడసాగారాయన. ఎదుటివాడిచేత తనకు కావలసిన పనిని చక్కగా చేయించుకోగల నేర్పరి!

నేనేం మాట్లాడకపోవడం చూసి "ఏం కుమార్, ఏమంటావ్?" అనడిగారు. నేను అప్పటికే ఒక నిర్ణయానికొచ్చాను. అందుకే "సారీ సర్! నేనా వార్త రాయలేను" అన్నాను స్థిరంగా. ఆయన ఆశ్చర్యపోతూ నావంక చూశారు. నా నుండి అటువంటి సమాధానం వస్తుందని ఊహించుండకపోవచ్చు. "అంటే ఆ ఉద్యోగులు లంచాలు పుచ్చుకోవడం లేదంటావా?" అన్నారాయన కోపంగా.

నేను చిన్నగా నవ్వుతూ "లేదనను. వాళ్ళు నిజంగానే లంచాలు పుచ్చుకొంటున్నారు. కాని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, ఎమ్మెల్యే, ఇతరత్రా మీకు కావలసిన దగుల్బాజీలు ప్రజలను దోచుకుంటున్నంత కాదు..." అనే సరికి ఆయన ముఖం కోపంతో జేవురించింది.

నాకు తెలుసు – ఆ పత్రికలో నా ఉద్యోగానికి అదే చివరి ఘడియని! అయినా నేను చెప్ప దలుచుకుంది ఇన్నాళ్ళకు ధైర్యంగా చెప్పే అవకాశమొచ్చింది. ఇక తరువాత జరుగబోయే పరిణామాలు గురించి ఆలోచించ దలుచుకోలేదు. అందుకే మళ్ళీ నా మాటలు కొనసాగిస్తూ "ఆ ఉద్యోగులు ఆఫీసు కొచ్చే వాళ్ళని జలగల్లా పీడిస్తున్నారు. నిజమే! కాని వాళ్ళకా పరిస్థితి ఎందుకొచ్చిందో తెల్సామీకు? వారికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. అందుకే అది అవినీతి వార్త కాదు, ఆకలి వార్త. అదసలు నా దృష్టిలో వార్తే కాదు" అని బైటకు నడిచాను.

◇

తెలుగు కళాసమితి న్యూజెర్సీ వారి కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్స్






